# వాత్సల్యం

మండుతున్న జ్యోతి మీద మూకుడు బోర్లించి ఆకాశంలో వెలుగు ఆరిపోతున్నది.

చౌరాస్తాలోని మ్యునిసిపాలిటీ గడియారం నగరం గుండెల మీద ఆరు దెబ్బలు కొట్టింది.

బస్ స్టాప్‌లో నిల్చుని రోడ్డుమీది రద్దీని చూస్తూ నిలబడ్డ రాజు ఉలిక్కిపడ్డాడు.

ఆరు అయిపోయింది.

బస్ ఇంకా రాలేదు.

అసలే చిరాకుగా నిల్చుని వున్న రాజుకు పక్కనే కీచుగొంతు ఏడుపుకోపం వచ్చింది.

విసుగ్గా పిల్లకేసి చూశాడు.

ఆ పిల్లకు ఐదేళ్ళుంటాయో లేక మూడేనో చెప్పడం కష్టమే. పెద్దపొట్టా, పుల్లల్లాంటి కాళ్ళూ చేతులూ నల్లటి రంగూ ...

పసిపాపకు సహజమైన పాల బుగ్గలు లేవు. బోసి నవ్వులూ లేవు ముక్కునుంచి కారుతున్న చీమిడి మధ్య మధ్య ఎగబీలుస్తూ వుంది.

ఆ పక్క నేవున్న నిండుచూలాలినిచూసి, తల్లికాబోలు అనుకున్నాడు.

ఆమె ఆ పిల్ల నెత్తిమీద "పెటీ పెటీ" మని మొట్టికాయలు వేసింది సణుక్కుంటూ. పిల్ల ఏడుపు తార స్థాయిని అందుకుంది.

రాజు ఆమెను పరిశీలనగా చూశాడు.

ఎముకల్లో మూలుగు సన్నగిల్లి, రక్తంలో జీవం చచ్చి, కళ్ళల్లో కాంతి మందగించినా, ఆమె ఇంకా మరో ప్రాణికి తనలో జీవంపోస్తూ వుంది. కాలం గీచిన ఆమె నొసటిమీది గీతలూ, చీకట్లు ముసురు కుంటున్నట్టున్న ఆ కళ్ళూ, ఎముకలు కన్పిస్తున్న కాళ్ళూ చేతులూ, తమ తమ గాథల్ని విన్పిస్తున్నాయి.

బస్ కోసం వేచి వుండటమే ఒక చిరాకు. పైగా పిల్ల పీచు గొంతు రొద ఒకటి చెవుల్లో! ఓదార్చడంపోయి పిల్లను బాదుతూవుంది ఆ తల్లి.

"ఇదుగో! ఏమమ్మోయ్! బిడ్డను అలా కొట్టి ఏడిపించకపోతే పాలిచ్చి సముదాయించ కూడదూ?" రాజు మాటలు గొంతులో ఉంగిడి చుట్టుకు పోయాయి ఆ చూలాలిని చూస్తుంటే.

"పాలా?" అంటూ ఆమె తన పొట్టకేసి చూసుకుంది.

ఆ చూపుల్లో వుంది. సిగ్గో, అసహ్యమో, జాలో, మాతృత్వమో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించ లేదు రాజు.

"పాలైతే ఆ కొట్లో వున్నాయి. పైసలేలేవు." చిన్నగా వణుకుతున్న గొంతుతో అన్నది ఆ చూలాలు.

రాజు పావలా తీసి విసురుగా ఆమె చేతిలో వేశాడు.

"ఈ పిల్లను కూడ మోసుకెళ్ళ లేను. ఈ పక్క కొట్టునుంచే పాలు తెచ్చే వరకూ కొంచెం చూస్తారా?" దీనంగా అడిగింది.

"అవును! పాపం! నిన్ను నువ్వే మోసుకో లేకుండా వున్నావు. ఇంకా పిల్లను కూడా ఎక్కడ మోస్తావ్?" మనసులోనే అనుకున్నాడు. పైకి అంగీకార సూచకంగా తల ఊపాడు.

సంచిలోని గిన్నె చేతిలోకి తీసుకొని డబుల్ డెక్కర్ బస్‌లా భారంగా మెల్లగా కదిలింది.

"త్వరగా రా!" రాజు వెనకనుంచి అన్నాడు.

ఆమె విన్నదో లేదో కాని తిరిగి చూడలేదు.

"పోషించలేని వాళ్ళకు పిల్లలెందుకో? బుద్ధిలేకపోతే సరి!" నిండుగా బరువుగా మెల్లగా తిరిగి చూడకుండా వెళ్తున్న ఆమెను చూసి విసుక్కున్నాడు రాజు.

ఆలోచనా స్రవంతిలో పడి కొట్టుకుపోతున్న రాజుకు పేవ్ మెంటు మీద నుంచి ఏడుస్తూ రోడ్డుకేసి నడుస్తున్న పిల్ల కన్పించింది. చటుక్కున ముందు కెళ్ళి పిల్ల రెక్కపట్టుకొని తీసుకొచ్చి పేవ్ మెంటు మీద నిలబెట్టాడు. పిల్ల ఏడుపు పెద్దది చేసింది. ఆ పిల్ల ఏడ్పు ఎలా మాన్పించాలో తెలియక తికమక పడ్డాడు రాజు.

గంట స్తంభం మీాద గడియారం ఒకే గంట కొట్టింది. ఆరున్నర అయింది అవిడ ఇంకా రాలేదే! రాజుకు తను ఎక్కవలసిన బస్ కన్పించింది. బస్ వచ్చి ఆగింది. ఎక్కాలా వద్దా అని అనే మీామాంసలో పడ్డాడు.

బస్ ఎక్కి వెళ్లిపోతే? ఈ పిల్ల రోడ్డు మీాదకు పరిగత్తి చేసి కిందో పడితే?

బస్ ఆగడం వెళ్ళిపోవడం కూడా జరిగింది. రాజుకు చిరాకు ఎక్కువైంది. మరో పది నిముషాలు గడిచాయి.

ఇరవై గజాల దూరంలో వున్న కొట్టునుంచి పాలు తేవడానికి ఇంత సేపా? అది - ఆ పిల్లతల్లి - ఆ ఆడది తనను మోసం చెయ్యలేదు కదా?

రాజుకు ముచ్చెమటలు పట్టాయి.

ఏమిటీ దారుణం! ఆ పిల్లను వదిలేసి వెళ్ళిపోయిందా! మాతృత్వం సాకారం అయిందా అన్నట్టున్న ఆ స్త్రీ ఇంత దారుణానికి ఒడి కట్టిందా! కన్నబిడ్డనే ఇలా వదిలేస్తుందా?

ఏం ఎందుకు కాకూడదూ! మోయలేని బరువును దింపేయడం తప్పా? పాపం! వదిలేయ్యక ఏం చేస్తుంది! మోయలేక వదిలేసిన బరువును ఎవరు నెత్తికి ఎత్తుకుంటారు!

తను ఎవరి స్థితి చూసి జాలిచూపాడో ఆమే తనను మోసం చేసింది. తన కెందు కొచ్చిన న్యూసెన్సు!

రాజు రెండు అడుగులు ముందుకు వేశాడు.

"మామయ్యా?" బొంగురు గొంతు ఏడుపు.

రాజు యాంత్రికంగా ఆగిపోయాడు.

ఏం చెయ్యడం? పసి బిడ్డను వదిలేసి ఎలా వెళ్ళి పోవడం?

ఇంటికి తీసుకెళ్తే.

తనకు ఈ పిల్ల పెద్ద బరువు కాదు. తనకు ఇద్దరే పిల్లలు.

కాని ... దీని కులం ఏమిటి? కన్నబిడ్డని వదిలేసిన దీని తల్లి ఎలాంటిదో తన భార్య అంగీకరిస్తుందా?

తను ఈ పిల్లను తన బిడ్డలతో పాటు పెంచడానికి ఇష్టపడుతుందా? అసంభవం!

ఈ అమాయక ప్రాణి తన మనసులోని భావాలను అర్థం చేసుకున్నట్టు ఏడ్పు మానేసి బిక్కు బిక్కు మంటూ తన ముఖంలోకి చూస్తుంది.

రాజు చేతిలో వున్న బిస్కెట్ల పొట్లం విప్పి రెండు ఆ పిల్ల చేతిలో పెట్టాడు. ఆ పిల్ల బిస్కెట్లు గబగబా తింటూ వుంది, మరో రెండు ఇచ్చాడు.

రాజు కళ్లు పిట్టగోడ మీద కూర్చుని బీడీ పొగ వదులు తున్న గఫూర్ మీద పడ్డాయి. చటుక్కున ఓ ఆలోచన తట్టింది.

పిల్లను తీసుకొని గఫూర్ కు దగ్గర్లో గోడపక్కగా నిలుచున్నాడు.

"ఇదుగో భాయ్! సిగరెట్టు ప్యాకెట్ అయిపోయింది తెచ్చుకుంటా అందాకా ఈ పిల్లను చూసుకుంటావా?"

అన్నాడు రాజు ఎదురుగా కన్పిస్తున్న సైకిల్ షాపుకేసి చూస్తూ.

గఫూర్ తల ఎత్తకుండానే బీడీ దమ్ములాగి పొగ వదుల్తూ "ఊ" అన్నాడు.

పిల్ల బిస్కెట్లు తింటూ వుంది.

రాజు ఎవరో తరుముతున్నట్టు వడివడిగా వెళ్ళిపోయాడు మరో రెండు బిస్కెట్లు పిల్ల చేతిలో వుంచి.

ఎవరో లుంగీ పట్టి లాగినట్టు అయి గఫూర్ కిందకు చూశాడు. పిల్ల లుంగీ పట్టుకు లాగుతూ గఫూర్ చూడగానే చటుక్కున వదిలేసి ఏడుపు ప్రారంభించింది.

అంత వరకూ ఆ పిల్ల విషయమే మర్చిపోయి ఆలోచిస్తూ కూర్చుని వున్న గఫూర్‌కు చటుక్కున ఏదో తోచి చేతి గడియారం కేసి చూసుకున్నాడు.

అరే ఏడున్నర అవుతూ వుందే! మరి ఆ పెద్ద మనిషి ఏడీ? ఈ పిల్ల అతని కూతురా? నమ్మటానికి వీల్లేదు.

ఇందులో ఏదో మోసం వుంది.

అనేక మోసాలు చేసిన తనకే మోసం జరిగింది. పిల్లని తేరిపార చూశాడు గఫూర్.

కనీసం మంచి దుస్తులు గానీ చిన్నమెత్తు బంగారం గానీ ఆ శరీరం మీద కన్పించ లేదు. మురికి ఓడుతున్న దుస్తుల్లో వున్న ఆ పిల్ల రూపం ఇక సరే సరి! అమ్మినా ఎవడూ కొనడు.

ఛూత్! తన కెందుకీ గొడవ ?

గఫూర్ రెండడుగులు ముందుకు వేశాడు.

ఎవరో లుంగీ పట్టి లాగినట్లయింది. ఏడుస్తూనే ఒక సారి గఫూర్ ముఖంలోకి చూసి, గట్టిగా కళ్ళు మూసు కుంది ఆ పిల్ల.

గఫూర్ జాలిగా ఆ పిల్లకేసి చూశాడు. ఆ పిల్లను ఎత్తుకొని ఓదార్చాలని పించింది.

ఇదేమిటి? ఎప్పుడూ ఎవరి మీదా కలగని జాలి ఈ బిడ్డ మీద ఎందుకు ?

తీసుకెళ్ళి పెంచుకుంటే ?

కాఫిరు బిడ్డను సాకటమా ?

గఫూరు మనసులోనే అల్లాను తల్చుకుంటూ చెంపలు వాయించు కున్నాడు.

కాని ఎలా ఈ బిడ్డను వదిలేసి వెళ్ళడం?

ఎంత భయపడుతూ తన లుంగీ పట్టుకుందో పాపం !

గఫూరు అటూ ఇటూ చూశాడు.

మోకాళ్ళ పైకి అంగవస్త్రం కట్టుకొని, పర్సు లేకుండా, చేతిలో పంచాగం వగైరాలతో వస్తున్న శాస్త్రిల వారు కన్పించారు.

గఫూరు మనసులో ఆలోచన తళుక్కుమంది.

ఆ శాస్త్రిల వారికి తగిలిస్తే సరి!

"ఏమండోయ్ శాస్త్రిలు ?"

శాస్త్రి ఉలిక్కిపడ్డాడు.

"దూరం! దూరం!" అంటూ దగ్గిరగా వస్తున్న గఫూర్‌కు దూరంగా వెనక్కు అడుగు వేశాడు శాస్త్రి.

"ఏహే! భయపడకు. నిన్ను ముట్టుకోనులే, కాస్తంత ఈ పిల్లను చూడు. ఆ పక్కకెళ్ళి ఓ క్షణంలో కాలుమడుచుకొస్తా!" అని శాస్త్రి సమాధానానికి కూడా ఎదురుచూడకుండా "చూడమ్మా! తాత! ఇప్పుడే వస్తా!" అంటూ పిల్ల గుప్పెట్లో నుంచి లుంగీ వదిలించుకొని గబగబా వెళ్ళిపోయాడు గఫూర్.

తాతలంటే వుండేసర్దా పిల్లలకు మరెవరన్నా వుండదు.

శాస్త్రి మోకాళ్ళ పైకి వున్న ధోవతిని పట్టిలాగుతూ "తాత! తాత!" అంటూ బోసినోటితో నవ్వింది.

శాస్త్రికి వళ్ళు జలదరించింది. ఏదో పురుగు వంటిమీద పాకుతున్నట్టు అనిపించింది.

"రామ! రామ!" వెనక్కు జరిగాడు.

ఆ పిల్ల ముందుకు జరిగింది.

"తాత! తాత." మళ్ళీ అన్నది.

"హరి హరీ! ఈ తురకపిల్లకు నేను తాతనా? లబలబ లాడి పోయాడు శాస్త్రి.

ఎంతకు గఫూర్ రాలేదు. ఆ పిల్ల శాస్త్రిని వదలడం లేదు.

వాడు ఇంకా రాలేదేం!

మోసం చెయ్యలేదుకదా? అవును! అంతే జరిగి వుండాలి. లేకపోతే ఇంతసేపు ఎందుకు రాడూ?

శాస్త్రి అశాంతిగా అటూ ఇటూ చూశాడు.

ఈ పీడ వదిలించుకోవడం ఎలా?

నవగ్రహశాంతి చేయించి వస్తున్న శాస్త్రిలవారు పెద్ద అశాంతిలోనే పడ్డారు.

రాజు ఇంటిగడపలో కాలు పెడ్తూనే దేనికోసమో మరాం పెడుతున్న చిన్ని ఏడుపు వినిపించింది రాజుకు.

రాజుకు ఆ ఏడుపును మింగేస్తు బొంగురుగొంతునుంచి వచ్చేఏడుపూ "మామయ్యా!" అనే పిలుపూ వినిపించాయి. స్మృతిపథంలో ఆ పిల్ల ఏడుస్తూ రోడ్డుకు అడ్డంపడి వడుస్తున్నట్టు కన్పించింది.

గిర్రున వెనక్కు తిరిగాడు.

ఆ బిడ్డను ఆరౌడీ ఏం చేశాడో? ఆ బిడ్డ దేని కింద యినా పడిపోయిందో ఏడ్చి ఏడ్చి శోషవచ్చి పేవ్మెంటుమీదే పడిపోయిందో? తను ఎంత నీచంగా ప్రవర్తించాడు?

ఆపక్కగా పోతున్న ఆటో ఆపి ఎక్కాడు.

చౌరాస్తా దగ్గిరకు వస్తున్న రాజుకు మరోరోడ్డునుంచి పరుగుపరుగున వస్తున్న రౌడీ గఫూర్ కన్పించాడు!

వీడు తను అనుకున్నంతా చేశాడు.

బస్‌స్టాండ్‌లో జనంమూగివున్నారు.

అటునుంచి రాజూ, ఇటునుంచి గఫూర్ "పాపా!" అంటూ జనాన్ని తోసుకుంటూ వచ్చి అక్కడి దృశ్యం చూసి నిలబడిపోయారు.

పాప శాస్త్రిలవారి కాళ్ళకు చుట్టుకొని వదలడంలేదు.

జనం తలోక మాటా అంటున్నారు.

"ఈ పిల్లకు నేను తాతను కాను బాబోయ్!" అంటూ లబలబలాడుతున్న శాస్త్రిలవారి మాటను ఎవరూ వినిపించుకోవడంలేదు.

చుట్టూ మూగిన జనానికి నచ్చ చెప్పడానికి తాతకు తాతలు దిగి వస్తున్నారు.

రాజును చూసి ఆ పిల్ల "మామయ్యా!" అంటూ దగ్గిరకు వచ్చింది.

పక్కనే నిల్చున్న గఫూరును చూసి భయంతో కళ్ళు మూసుకుంది.

రాజూ, గఫూరూ పిల్లను తాను తీసుకెళ్తానంటే, తను తీసుకెళ్తానని పోటీపడటాన్ని జనం వింతగా చూస్తున్నారు.

లేగదూడకోసం "అంబా" అంటూ రంకెలు వేస్తూ వచ్చిన ఆవులా, చిట్టీ, అంటూ వచ్చింది ఓ నిండు బాలాలు.

వాత్సల్యం కట్టలు తెంచుకుంది.

తల్లీ బిడ్డా పైన వేసుకు పోయారు.

ఆ స్త్రీ రాజుకేసి చూడటానికి సిగ్గుపడింది.

జేబులోనుంచి పది రూపాయల నోటుతీసి పిల్లకు అందించాడు రాజు.

ఒక రూపాయినోటూ, కొంతచిల్లరా తీసిపిల్ల చేతిలో పెట్టాడు గపూరు.

శాంతి చేయిస్తే వచ్చిన సంభావన డబ్బులు బిడ్డ చేతిలో వుంచి కన్నీళ్ళతో కదలి పోయాడు శాస్త్రి.